క్లుప్తంగా

గోవిలాపం


చనిపోయిన ఆవు చుట్టూ చేరిన మూగజీవాలు

కాజులూరు: మనుషులు ఎవరైనా చనిపోతే కుటుంబీకులు, స్నేహితులు ఆ పార్థివ దేహం వద్ద కూర్చొని గుండెలవిసేలా రోదిస్తుంటారు. వారిని ఓదార్చేందుకు వచ్చిన బంధు, మిత్రులు సైతం కంటతడి పెడుతుంటారు. అయితే తన సహచరులు చనిపోతే మనుషులే కాదు.. మూగజీవాలు సైతం అదేరీతిలో ఆవేదన చెందుతాయని ఈ సంఘటన రుజువు చేస్తోంది. బుధవారం అర్ధరాత్రి సమయంలో గొల్లపాలెంలోని కాకినాడ – కోటిపల్లి రహదారిపై ఒక చూడి ఆవును గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. గురువారం తెల్లవారిన తర్వాత అటుగా వచ్చిన మరో ఆవు చూడిఆవు కళేబరాన్ని కొద్దిసేపు పరిశీలనగా చూస్తూ ముందుకు వెళ్లిపోయింది. కొద్దిసేపటి తర్వాత ఒక ఎద్దు, మరికొన్ని ఆవులు చనిపోయిన ఆవు వద్దకు చేరి కొద్దిసేపు చూస్తూ ఉండిపోయాయి. దాని సమీపంలోనే తిరుగాడాయి. తోటి జీవి చనిపోవడంతో ఆ మూగజీవాల వేదన స్థానికులను ఆలోచింపజేసింది.

డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ సదస్సు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు

మండపేట: మారేడుబాకలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆగస్టు 22, 23 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే నెలలో స్మార్ట్ మెటీరియల్‌పై జరిగే ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయి సైంటిస్టులు హాజరవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఫిజిక్స్ అధ్యాపకులు, కన్వీనర్ కె.శ్రీనివాసరావు, సెక్రటరీ కె.కిరణ్‌కుమార్, డాక్టర్ నెహ్రూ నాయక్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు కౌలు రైతులకు రుణాలు


టేకిలో రైతులతో మాట్లాడుతున్న బ్యాంకు ప్రతినిధులు

కపిలేశ్వరపురం: బ్యాంకు నిబంధనల మేరకు కౌలు రైతులకు రుణాలను మంజూరు చేయనున్నట్టు మండలంలోని టేకి గ్రామ రైతులకు యూనియన్ బ్యాంకు టేకి బ్రాంచి మేనేజర్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద వ్యవసాయాధికారులు, బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో కౌలు రైతులకు రుణ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మేనేజర్ కుమార్ మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులున్న కౌలు రైతులకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. భూమి గల రైతు అంగీకారం తప్పనిసరి అన్నారు. మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే వ్యవసాయ సహాయకుడు గంజా హరిబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు వద్ద నిరసన

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక గ్రామంలో అగ్రహారం రోడ్డు వద్ద ఉన్న డంపింగ్ యార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానికులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు కారణంగా దోమలు తమ నివాసాలపై విజృంభిస్తున్నాయని, వర్షం పడితే తీవ్ర దుర్గంధం వస్తుందన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే డంపింగ్ యార్డును అక్కడి నుంచి తరలించాలంటూ డిమాండ్ చేశారు. సర్పంచ్ పెనుమాల సునీత డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి ప్రజలతో మాట్లాడి సర్ది చెప్పారు. సమస్యను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దృష్టికి తీసుకెళతామన్నారు. నిరసనలో యాళ్ల సుబ్బలక్ష్మి, పుత్సల వరదరాజులు, కాశిన బాబి పాల్గొన్నారు.


బండారులంక డంపింగ్ యార్డు వద్ద నిరసన తెలుపుతున్న స్థానిక ప్రజలు

ఇంచుముంచు ఇలానే..

- ఏటా వరదల సమయంలో బిక్కుబిక్కు
- లంక పొలాలకు ముప్పు
- ఆందోళన చెందుతున్న రైతులు

కె.గంగవరం: గోదావరికి వరదల సీజన్ రానే వచ్చింది.. లంక రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఏటిగట్లు బలహీనంగా ఉండడంతో గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతుంటే.. మరోవైపు లంక పొలాలను కౌలు సాగు చేస్తున్న రైతులకు వరదలతో నష్టపోతామనే ఆందోళన నెలకొంది. ప్రస్తుతం గోదావరి ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలు వారిని కలవరపెడుతున్నాయి. సాధారణంగా ఏటా జూలై 15 నుంచి సెప్టెంబర్ 15 వరకూ గోదావరి నదికి వరదలు వస్తుంటాయి. ఈ నదికి ఉధృతంగా వచ్చే వరదలు సారవంతమైన లంక భూముల్లో సాగువుతున్న వివిధ రకాల ఉద్యాన, పూల తోటలను ముంచెత్తుతాయి. అందుకే ఈ ప్రాంతంలో లంక పంట.. గోదారి మోత అనే సామెత ఉండనే ఉంది. పోనీ వరదల సీజన్‌లో పంటలు వేయకుండా ఉందామంటే బతుకు తెరువు ఉండదని రైతులు అంటున్నారు. కష్టమైనా, నష్టమైనా గోదావరి లంకల్లో పండే పంటలే తమకు జీవనాధారమని చెబుతున్నారు.

ఆ మండలాల్లోనే..

కె.గంగవరం మండలం కూళ్ల నుంచి మసకపల్లి వరకూ ఉన్న గోదావరి లంక భూముల్లో ఉద్యాన పంటలు భారీగానే పండిస్తున్నారు. కె.గంగవరం మండల వ్యాప్తంగా ఏటా అరటి 190 ఎకరాల్లో, బొప్పాయి 30 ఎకరాలు, కూరగాయలు 165 ఎకరాల్లో పండిస్తుండగా, కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక పరిధిలో కొబ్బరి 300 ఎకరాలు, అరటి 330 ఎకరాలు, కూరగాయలు 70 ఎకరాలు, కేదారిలంక పరిధిలో కూరగాయలు 270 ఎకరాలు, బొప్పాయి 80 ఎకరాలు, అరటి 458 ఎకరాలు, కొబ్బరి 200 ఎకరాల్లో పండిస్తున్నారు. ఈ భూములన్నీ సారవంతమైన భూములే. వేసవి కాలంలో కూడా నీటి వసతికి ఇబ్బంది లేదు. ఈ భూముల్లో రైతులు ప్రధానంగా కొబ్బరి, కోకో, అరటి, పసుపు, కంద, పుచ్చ, మామిడికాయ, కూరగాయలు, పూల తోటలు, బొప్పాయి, తమలపాకులు, మునగ, జామ వంటి పంటలు వేస్తుంటారు. గోదావరికి వరదల సమయంలో పంటలు ముంపు బారిన పడతాయని రైతులు చెబుతున్నారు. తాత్కాలిక పంటలైన కూరగాయలు, పూల తోటల నుంచి ఆదాయం లభించినప్పటికీ దీర్ఘకాలిక పంటలైన అరటి, కంద, పసుపు, తమలపాకులు, మునగ తోటలు ముంపులో చిక్కుకుని దెబ్బతింటున్నాయని చెబుతున్నారు. ఇంచుమించు వరదల సమయంలోనే ఈ పంటలు దిగుబడికి వస్తాయి. గోదావరి కన్నెర్ర జేస్తే పెట్టిన పెట్టుబడితో సహా మొత్తం ఊడ్చుకుపోతుంది.


కె.గంగవరం మండలం లంక పొలంలో కళకళలాడుతున్న అరటి, కొబ్బరి తోటలు


బోదిలంక వద్ద వరద ఉధృతికి మునిగిన బొప్పాయి తోట (ఫైల్)


వరదల కారణంగా లంకల్లోని పశువులను గట్టుకు చేర్చిన దృశ్యం (ఫైల్)

పశు సంపద కూడా..

లంక రైతులు ఉద్యాన పంటలతో పాటు పాడి పరిశ్రమకు కూడా ప్రాధాన్యమిస్తారు. తమ పశువులను లంక పొలాల్లోనే మకాం వేసి ఉంచుతారు. అక్కడే వాటికి సరైన ఆహారం లభిస్తుంది. కానీ వరదల సమయంలో పశువులను గట్టుకు చేరుస్తారు. అప్పుడు వాటికి సరైన ఆహారం లేక బక్కచిక్కుకుపోతాయి. దీంతో పాటు రాత్రికి రాత్రే గోదావరి ఉప్పొంగినప్పుడు పశువులు కూడా కొట్టుకుపోతుంటాయి. ఇలా వరదలు వస్తూనే రైతులకు కష్టాలు తెస్తున్నారు.

చేతికి వస్తుందో... లేదో?

పంట బాగా పండి, మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తున్న తరుణంలోనే గోదావరికి వరదలు వచ్చి తుడిచి పెట్టుకుపోతుంటాయి. వరద రాకపోతే పంట చేతికి దక్కుతుంది. ప్రస్తుతం బొప్పాయి తోట నాలుగు ఎకరాల్లో వేశాను. ఈ ఏడాది ఇంకా వరద రాలేదు. వచ్చినా మెట్ట ప్రాంత లంక భూములు కొంత వరకూ బాగానే ఉంటాయి. కానీ పల్లపు భూముల్లో పంట మొత్తం పోతోంది.

–కాదా గోవిందు, లంక రైతు, మసకపల్లి

ముందు జాగ్రత్త అవసరం

ప్రస్తుతం వరద ఉధృతి ఇంకా లేదు. కూరగాయల సాగు చివరి దశలో ఉంది. మిగిలిన పంటకు చెందిన రైతులు ముందు జాగ్రత్త వహించి తమ పంటలను విక్రయించుకోవాలి. జాగ్రత్తలు పాటిస్తే వరద ఉధృతి నుంచి పంటలను కొంత వరకూ కాపాడుకోవచ్చు.

–కోటేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారి, కపిలేశ్వరపురం మండలం

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి


ర్యాలీలో పాల్గొన్న జడ్జిలు, న్యాయవాదులు తదితరులు

రామచంద్రపురం: ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలను అదే కాపాడుతుందని సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు అన్నారు. రామచంద్రపురం మండల లోక్ అదాలత్ ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ జరిగింది. సబ్ కోర్టు ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని మెయిన్ రోడ్డు మీదుగా సాగింది. న్యాయవాదులు, పోలీసు సిబ్బంది హెల్మెట్లు ధరించి మోటారు సైకిళ్లతో ర్యాలీలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పిల్లి మురళీమోహన వెంకటరమణ, పలివెల సత్యనారాయణ, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, వికాస డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలపై అధ్యయనం


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో వివిధ రాష్ట్రాల సభ్యులు

రామచంద్రపురం రూరల్: భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలపై అధ్యయనం చేసే విధంగా హైదరాబాద్‌కు చెందిన పంకత్ సక్సేనా ప్రారంభించిన బృహత్ స్టార్టప్ కంపెనీ బృహత్ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్స్, రిటైర్డ్ ప్రొఫెసర్లు గురువారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. బృంద సభ్యులు అంకిత్ మిశ్రా మాట్లాడుతూ దేశంలోని క్షేత్రాలన్నీ తిరిగి సంస్కృతీ సంప్రదాయాలపై అధ్యయనం చేస్తున్నామన్నారు.

పంట పొలాల పరిశీలన

రామచంద్రపురం రూరల్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ సూచించారు. వెల్ల గ్రామంలో పంట పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్ మాట్లాడుతూ ఊడ్చిన పొలంలో నీటి ముంపునకు గురైనట్లయితే నీటిని పూర్తిగా బయటకు తీసివేసి, పై పాటుగా ఒక ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను బూస్టర్ డోస్‌గా వేయాలని సూచించారు. వెదజల్లే పొలాలలో విత్తనం చల్లిన వెంటనే అధిక వర్షాలతో విత్తనాలు కుప్పగా చేరడం, పైన మట్టి కప్పబడటం వల్ల మొలక దెబ్బ తింటుందన్నారు. అందువల్ల వర్షాలు తగ్గిన వెంటనే నీరు తీసేసి పై పాటుగా ఒక ఎకరానికి 20 కిలోల యూరియా, పది కిలోల పొటాష్ బూస్టర్ దోసుగా వెయ్యాలన్నారు. తెగుళ్ల వ్యాప్తిని అరికట్టడానికి ఊడ్చిన, వెదజల్లిన పొలాల్లో ఒక గ్రాము కార్బెండిజం, 2 గ్రాముల కార్బెండిజం, మాంటజెల్ మిశ్రమాన్ని ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వెల్లలో పంట పొలాన్ని పరిశీలిస్తున్న ఏవో సత్యప్రసాద్

స్టూడెంట్ కిట్ల పంపిణీ

మండపేట: విద్యార్థులు చదువులో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. గురువారం స్థానిక శ్రీజవహర్‌లాల్ మున్సిపల్ హైస్కూల్లో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. చైర్‌పర్సన్ దుర్గారాణి కిట్ల పంపిణీని ప్రారంభించారు. విద్యతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కౌన్సిలర్లు కాళ్లకూరి స్వరాజ్యభవాని, శెట్టి కల్యాణి, మందపల్లి రవికుమార్, గ్రంధి శ్రీనివాస్, హెచ్‌ఎం వీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమేశ్వరంలో..

రాయవరం: సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం ఆర్.దయామణి అధ్యక్షత వహించారు. పంపిణీ కార్యక్రమంలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, రామచంద్రపురం డీవైఈఓ ఎస్.నరసింహ ఫణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, ఎంపీడీఓ కె.వెంకటలక్ష్మి, ఎంఈఓలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ వైఆర్‌కే పరమహంస, పసలపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మండపేటలో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

అంగరలో..

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు గురువారం స్టూడెంట్ కిట్లను అందజేశారు. ఎంఈఓ కె.తాతారావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, గ్రామ నాయకులు పుత్సల శ్రీనివాస్, మత్సా గంగరాజు, పిల్లా బసవరాజు వీటిని పంపిణీ చేశారు.

23 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామ, సచివాలయాల్లో ఈ నెల 23 నుంచి 27 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కొండలరావు గురువారం తెలిపారు. రాష్ట్రంలో 49,83,561 మంది ఆధార్ బయోమెట్రిక్ నమోదు, 1,36,17,047 మందికి సంబంధించిన ధ్రువపత్రాల అప్‌డేషన్ పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆదేశాలపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారన్నారు. వీటితో పాటు ఐదేళ్లలోపు పిల్లలకూ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేస్తారన్నారు. 23, 24 తేదీల్లో అద్దంకివారి లంక, వాకతిప్ప, నల్లూరు సచివాలయాల్లో, 25, 26 తేదీల్లో కేదారిలంక, మాచర, అంగర-2, 27న కోరుమిల్లి-2, కేదారిలంక, వెదురుమూడి సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు ఉంటాయని వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం

కపిలేశ్వరపురం: కోరుమిల్లిలో నూతనంగా మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామంలో లోఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలని దీర్ఘకాలంగా గ్రామస్తులు కోరుతున్నారు. దీంతో ఆరు ట్రాన్స్‌ఫార్మర్లను అధికారులు మంజూరు చేశారు. సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, ఎంపీటీసీ సుంకర వెంకటేశ్వరరావు, ట్రాన్స్‌కో ఈఈ వై.విజయానంద్, డిప్యూటీ ఈఈ కె.మురళీమోహన్, అసిస్టెంట్ ఏఈ ఎస్‌ఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడి అమానుషం

అమలాపురం టౌన్: ఎంపీ మిథున్‌రెడ్డిపై టీడీపీ శ్రేణులు దాడి చేయడం అమానుషమని అమలాపురం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని అన్నారు. దాడిని ఖండిస్తూ గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీకే రక్షణ ఇవ్వలేని ఈ కూటమి ప్రభుత్వం శాంతి భద్రతల విషయంలో పూర్తిగా చేతులెత్తేసినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడి, వినుకొండలో వైఎస్సార్ సీపీ కార్యకర్త హత్య, రాష్ట్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ దాడులు అన్నీ కావాలని ఓ పథకం ప్రకారం చేస్తున్నారని ఆరోపించారు. అధికారం శాశ్వతం కాదన్న వాస్తవాన్ని కూటమి నేతలు గమనించి ప్రవర్తించాలని బులినాని సూచించారు.

ఉప్పలగుప్తం: రాజంపేట పార్లమెంటు సభ్యుడు, ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై టీడీపీ శ్రేణులు దాడి చేయడం దారుణమని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్ అన్నారు. రాష్ట్రంలో ఒక ఎంపీకు రక్షణ లేదా అని ప్రశ్నించారు. మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో గురువారం ఆయన నివాసంలో స్థానిక విలేకర్లతో సమవేశమై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రమంతా వైఎస్సార్ సీపీ నాయకులపై, కార్యకర్తలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఒక ఎంపీపై దాడి జరుగుతుంటే రక్షించలేని ప్రభుత్వం రాష్ట్ర ప్రజలని ఏ విధంగా రక్షిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేయటంలో చూపిస్తున్న శ్రద్ధ మేనిఫెస్టోను అమలు చేయడంలో చూపించాలన్నారు.

పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

అమలాపురం టౌన్: పట్టణంలో రోడ్లపై విచ్చలవిడిగా తిరుతున్న ఆవులు, ఆంబోదులు తదితర పశువుల వల్ల ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోందని పట్టణానికి చెందిన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లపై పశువుల సంచారం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోందని పట్టణ సీఐ కె.క్రిస్టోఫర్‌కు ఆయన వివరించారు. పట్టణ సీఐని గురువారం స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో కలిసి ఈ మేరకు ఓ వినతి పత్రాన్ని అందించారు. అనంతరం సీఐ క్రిస్టోఫర్‌ను జిల్లా చేతి వృత్తుల సంఘం తరపున సత్కరించారు. కార్యక్రమంలో చేతి వృత్తుల సంఘం, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా ప్రతినిధులు మునునూరి ఏసుబాబు, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం


వెదురుమూడిలో మూతపడిన ఇటుక బట్టీ


కోలంకలో భారీ వర్షానికి జలమయమైన యానం - ద్వారపూడి రహదారి

- స్తంభించిన జన జీవనం
- లోతట్టు ప్రాంతాలు జలమయం

మండపేట: అల్పపీడనం ప్రభావంతో మండపేట, రూరల్ గ్రామాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఈదురు గాలులు కూడా తోడయ్యాయి. దీంతో మండలంలోని 12 గ్రామాల్లోను, మండపేట పట్టణంలోను లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి. ఏడిద సీతానగరం గ్రామంలో అరటితోట వర్షం నీటితో నిండిపోయింది. పట్టణంలోని గాంధీనగర్, పార్థసారథి నగర్, వాటర్‌వర్క్స్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీల్లో మురుగునీరు రోడ్లపైకి చేరింది. ఏడో వార్డు ఎస్సీపేటలో చెట్టు కొమ్మ విరిగి వైర్లపై పడడంతో, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం వర్షం తీవ్రం కావడంతో కొన్ని ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. జనం ఇళ్లకే పరిమితం కావడంతో, వ్యాపార దుకాణాలు వెలవెలబోయాయి. కూలీలు, నిర్మాణ కార్మికులు పనుల్లోకి వెళ్లలేకపోయారు.

మూతపడ్డ ఇటుక బట్టీలు

కపిలేశ్వరపురం: మండలంలో ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కుండ పోతగా వర్షం పడడంతో, వ్యాపారాలకు విఘాతం కలిగింది. వెదురుమూడి గ్రామంలో మోటారు సైకిళ్లపై సామాన్ల వ్యాపారం చేసే వారంతా ఇళ్లకే పరిమితమయ్యారు. వరినాట్ల పనులు నిలిచిపోయాయి. కేదారిలంక, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు గ్రామాల్లోని ఇటుక బట్టీలు మూతపడ్డాయి. మండపేట పట్టణంలోని రైసు మిల్లు, కోళ్లఫారాల్లో కూలీలు పనుల్లోకి వెళ్లేందుకు అవస్థలు పడ్డారు.


మండపేట మెయిన్ రోడ్డులో కురుస్తున్న వర్షం

హోరు గాలి, జోరు వాన

కాజులూరు: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వాన పడింది. దీంతో జనజీవనం స్తంభించింది. విధులకు హాజరయ్యే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు, వీధుల్లో వర్షపు నీరు చేరింది. యానం– ద్వారపూడి రహదారిలో కోలంక బోసుబొమ్మ సెంటర్ వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నారుమడులు నీట మునిగాయి. వర్షాలకు నారుమడులు, వెదజల్లిన పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ తెలిపారు. గొల్లపాలెం, శలపాక, ఆర్యావటం, జగన్నాథగిరి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. శలపాకలో మాట్లాడుతూ పొలాల్లోని వర్షపునీరు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లకపోతే మొలకెత్తిన నారు దెబ్బతింటుందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది అనుషా, రమ్య పాల్గొన్నారు.